1

# దేవుడు కోరిన గృహం

**మూల వాక్యం:** ఎఫెసీయులకు 5:21–6:4.

కొన్ని సంవత్సరాల క్రిందట, "కుటుంబ బాంధవ్యాలను పెంపారజేయడం" అనే అంశం మీద ఒక సభా ప్రసంగంలో మాట్లాడమన్నారు. ఎన్నుకున్న అంశాన్ని అభినందించాను. పరిపక్వం అనే భావన నాకు నచ్చుతుంది: "అన్ని విషయములలో మనము క్రీస్తువలె ఉండుటకు ఎదుగవలసియుంటుంది" (ఎఫెసీయులకు 4:15బి). *బాంధవ్యాల* మీద నొక్కి చెప్పడం మంచిదిగా భావించాను: మనకందరికి యితర జనులు కావాలి (ఆదికాండము 2:18), అంతేకాదు, యితరులతో మనం ఎలా మసలుకోవాలో కూడ మనకు తెలియాలి. *కుటుంబము* అనే అంశం కూడ ఆనందం కలిగించింది: సాధారణంగా కుటుంబం కంటె ఎక్కువ ప్రశస్తమైంది నాకు ఏదీ లేదు. అందులో ప్రత్యేకించి నా సొంత కుటుంబంకంటె.

ఈ అంశం నన్ను తలమునకలు చేసిందని ఒప్పుకోక తప్పదు, అయినా: కుటుంబ బాంధవ్యాల్లో పరిపూర్ణత అనేదానిమీద నేను ఎలా ప్రసంగించగలను? నా యింటినుండి నేను దూరంగా ఉండినట్టయితే, "కుటుంబ బాంధవ్యాల్లో పరిపూర్ణత – దాన్ని నేను ఎలా సాధించాను" అనే విషయం ఉపదేశించి యుండేవాడనే. ఏదియెలాగున్నా, శ్రోతలలో కొందరు నన్ను ఎరిగినవారే, దానినుండి నేను ఎన్నడూ తప్పించుకోలేను!

నిజానికి, ఎఫెసీయులకు 5 తరువాయి భాగం నాకు తట్టేవరకు నేను ముందుకు సాగలేకపోయాను. అక్కడ పౌలు భార్యకు, భర్తకు, క్రీస్తుకు, సంఘానికి మధ్య ఉన్న సంబంధాలను గూర్చి చర్చించాడు. యేసు అను నామము పరిపక్వము అనేదానికి పర్యాయపదమైయుంది. క్రీస్తు సంబంధమును అతని ఆత్మ శరీరముతో చూడడంవలన, పరిపూర్ణ బాంధవ్యమనే ప్రాథమిక ఐడియాను మనం పొందగలం. అందువలన ఎఫెసీయులకు 5 చివరి భాగం ఎఫెసీయులకు 6 మొదటి భాగం ఆ నా ప్రసంగానికి మూల వాక్యమయ్యింది – ఆ పాఠాన్ని నేను ఎంజాయ్ చేశాను. అది బాగా స్వీకరింప బడినట్టుంది.

ప్రత్యేకమైన ఈ పాఠాల వరుసను ఆరంభించడానికి నేను యోచించుచుండగా, నా మనస్సు మరలా ఎఫెసీయులకు 5కు తిరిగింది. వివాహము, కుటుంబము అనే వరుసను పరిచయం చేయడానికి యింకా ఏ లేఖనం శ్రేష్ఠమైయుంటుంది? ఈ ప్రారంభ పాఠంలో, తలిదండ్రులకును, పిల్లలకును విషయాలను ఎత్తి చెప్పనుద్దేశించినందున, ఎఫెసీయులకు 5:21నుండి 6:4వరకు కొనసాగిస్తాను:

క్రీస్తునందలి భయముతో ఒకనికొకడు లోబడియుండుడి.

స్త్రీలారా, ప్రభువునకువలె మీ సొంతపురుషులకు లోబడియుండుడి. క్రీస్తు సంఘమునకు శిరస్సైయున్నలాగున పురుషుడు భార్యకు శిరస్సైయున్నాడు. క్రీస్తే శరీరమునకు రక్షకుడైయున్నాడు. సంఘము క్రీస్తునకు లోబడినట్టుగా భార్యలు కూడ ప్రతి విషయములోను తమ పురుషులకు లోబడవలెను. పురుషులారా, మీరును మీ భార్యలను ప్రేమించుడి. అటువలె క్రీస్తుకూడ సంఘమును ప్రేమించి, అది కళంకమైనను ముడుతయైనను అట్టిది మరి ఏదైనను లేక, పరిశుద్ధమైనదిగాను, నిర్దోషమైనదిగాను మహిమగల సంఘముగాను ఆయన తన యెదుట దానిని నిలువబెట్టుకొనవలెనని, వాక్యముతో ఉదకస్నానముచేత దానిని పవిత్రపరచి, పరిశుద్ధపరచుటకై దాని కొరకు తన్నుతాను అప్పగించుకొనెను. అటువలెనే పురుషులు కూడ తమ సొంత శరీరములనువలె తమ భార్యలను ప్రేమింప బద్ధులైయున్నారు. తన భార్యను ప్రేమించువాడు తన్ను ప్రేమించుకొనుచున్నాడు. తన శరీరమును ద్వేషించినవాడెవడును లేడు గాని ప్రతివాడును దానిని పోషించి సంరక్షించుకొనును. మనము క్రీస్తు శరీరమునకు అవయవములమై యున్నాము గనుక ఆలాగే క్రీస్తు కూడ సంఘమును పోషించి సంరక్షించుచున్నాడు. ఈ హేతువుచేత పురుషుడు తన తండ్రిని తల్లిని విడిచి తన భార్యను హత్తుకొనును; వారిద్దరును ఏక శరీరమగుదురు. ఈ మర్మము గొప్పది; అయితే నేను క్రీస్తునుగూర్చియు సంఘమునుగూర్చియు చెప్పుచున్నాను. మెట్టుకు మీలో ప్రతి పురుషుడును తననువలె తన భార్యను ప్రేమింపవలెను, భార్యయైతే తన భర్తయందు భయము కలిగియుండునట్లు చూచుకొనవలెను.

పిల్లలారా, ప్రభువునందు మీ తలిదండ్రులకు విధేయులైయుండుడి; ఇది ధర్మమే. నీకు మేలు కలుగునట్లు నీ తండ్రిని తల్లిని సన్మానింపుము, అప్పుడు నీవు భూమిమీద దీర్ఘాయుష్మంతుడవగుదువు, ఇది వాగ్దానముతో కూడిన ఆజ్ఞలలో మొదటిది. తండ్రులారా, మీ పిల్లలకు కోపము రేపక ప్రభువు యొక్క శిక్షలోను బోధలోను వారిని పెంచుడి.

ఈ లేఖన భాగంలో ఉన్న సారవంతమైన సత్యాలన్నిటిని మనం కవర్ చేయలేకపోగా, “దేవుడు ఎలాటి గృహం కావాలని కోరాడో” దాని గుణగణాలను మనం చర్చించేటప్పుడు, కొన్నింటిని తాకుదాం?

## స్వార్థ రాహిత్యం (5:21)

22వ వచనంతో గాక, 21వ వచనంతో మన పాఠ్య భాగం ఆరంభించడంలో నీవు ఆశ్చర్యపడవచ్చు. (ప్రత్యేకించి భర్తలమైన మనం) 22వ వచనంతో ఆరంభించగోరతాం: “స్త్రీలారా, ప్రభువునకువలె మీ సొంత పురుషులకు లోబడియుండిడి.” ఏదియెలాగున్నా, తరువాత వచ్చే వచనాలకు నేపథ్యం 21వ వచనంలో ఉంది: “క్రీస్తునందలి భయముతో ఒకనికొకడు లోబడియుండుడి.” మన కుటుంబాలలో మనకంటె ఎక్కువగా యితరులను గూర్చిన అక్కర మనలో ప్రతి ఒక్కరు కలిగియుండాలి.

21వ వచనం మన మూల వాక్యంలో భాగం కాదని నీవు ఒప్పింపబడినట్టయితే, దీన్ని ఆలోచించు: 22వ వచనంలో ఆది భాషయందు క్రియావాచకం లేదు; 21వ వచనంలోనుండి క్రియావాచకం అందచేయబడుతుంది. “లోబడియుండుడి” అని 22వ వచనంలోని దాని భావమేమైయున్నా, అది ముందుగా 21వ వచనంలో క్రైస్తవులందరి మీద (భర్తలతో సహా) రుద్దబడింది.

క్రొత్త నిబంధనలో అంతటా, ఉభయులు ఒకరికి ఒకరు లోబడియుండాలనే సూత్రం ప్రకటింపబడింది:

> ... ప్రేమకలిగినవారై యొకనికొకడు దాసులైయుండుడి (గలతీయులకు 5:13).
>
> ఒకని భారముల నొకడు భరించి ... (గలతీయులకు 6:2ఎ).
>
> కక్షచేతనైనను వృథాతిశయముచేతనైనను ఏమియు చేయక, వినయమైన మనస్సు గలవారై యొకనినొకడు తనకంటె యోగ్యుడని యెంచుచు మీలో ప్రతివాడును తన సొంతకార్యములను మాత్రమేగాక యితరుల కార్యములను కూడ చూడవలెను (ఫిలిప్పీయులకు 2:3, 4).
>
> ఘనతవిషయములో ఒకని నొకడు గొప్పగా ఎంచుకొనుడి ... (రోమా 12:10బి).

క్రీస్తు మనకు పరిపూర్ణమైన మాదిరియైయున్నారు, ఆయన “పరిచారము చేయించు కొనుటకు రాలేదు గాని పరిచారము చేయుటకును, ...” (మత్తయి 20:28).

మూల వాక్యంలో “ప్రేమ” అయిదుసార్లు ప్రస్తావించబడింది. అందులో ప్రతిసారి *agape* అనే పదంనుండి అది తర్జుమా చేయబడింది. ఈ ప్రేమ “స్వప్రయోజనమును విచారించుకొనదు” అని 1 కొరింథీయులకు 13:5లో చెప్పబడింది.

మన మూల వాక్యంలో తెలుపబడిన బాంధవ్యం యొక్క సరియైన దృక్పథాన్ని పొందడానికి గాను, ఒకరికొకరు లోబడియుండడమనే సూత్రాన్ని మనస్సులో ఉంచుకోవాలి. తానేమైయుండాలో అతడలా ఉండడానికి భార్య తన్ను లోబరచుకొనడం తన భర్తయెడల యిష్టపూర్వకమైనదైయుండాలి. భార్యపై భర్తయొక్క శిరస్సు అనే స్థితి ఎల్లవేళలా ఆమె సంతోషాన్ని వెదకునదైయుండాలి. ఎఫెసీయులకు 5 యొక్క తరువాత భాగంపై J. W. Shepherd యిలా కామెంట్ చేశాడు, “అన్యోన్యమైన ప్రేమ నమ్మకాలు ఎలా ఉండాలంటే, భర్త యొక్క కోర్కెగా ఎరుగబడినది భార్యకు చట్టమైయుండాలి, భార్య యొక్క వాంఛగా ఎరుగబడినది భర్త అంగీకరించే రూలైయుండాలి.”[1]

## గౌరవం (5:21)

గృహంలో ఉండవలసిన బాంధవ్యాలు ఉండవలసినట్టుగానే ఉండాలంటే, అవి *క్రైస్తవ* బాంధవ్యాలైయుండాలి; ఇది అన్నిటికంటె ప్రధానమైనదైయుండాలి. “*క్రీస్తునందలి భయముతో* ఒకనికొకడు లోబడియుండుడి” అని 21వ వచనం ఆజ్ఞాపిస్తుంది. భయము అనేది దైవికమైన భయం, గాఢమైన గౌరవం, లేక మర్యాద.


కుటుంబంలోని ప్రతి ఒక్కరు ప్రభువును గౌరవించనియెడల కుటుంబం ఎలాటిదై యుండాలో అది అలా ఉండదు. అభ్యాస సంబంధమైన మాటల్లో దాన్ని పెట్టాలంటే, కుటుంబంలోని ప్రతి సభ్యుడు, సభ్యురాలు క్రైస్తవుడై, క్రైస్తవురాలై – నిజమైన క్రైస్తవుడు, క్రైస్తవురాలు, నమ్మకమైన క్రైస్తవుడు, క్రైస్తవురాలు, సమర్పణతో కూడిన క్రైస్తవుడు, క్రైస్తవురాలైయుండాలి. జీవమను కృపావరములో పాలివారమని నిజంగానే చెప్పగల భార్య భర్తలు ఉండడం ఎంత మనోహరమైయుంటుందో! (1 పేతురు 3:7 చూడు.)

వివాహము, గృహము, మరియు కుటుంబము అనేవి అన్నీ దేవుని ఏర్పాటులో భాగమైయున్నాయి – ఆ ఏర్పాటు ఎలా పని చేయాలో దేవుడు తెలుపుతాడు. Charles Spurgeon యిలా రాశాడు, "దేవుని వాక్య ప్రకారము గృహము పాలింపబడినప్పుడు, మనతో ఉండమని దేవుని దూతలు అడుగవచ్చు, తమ ప్రథమ సూత్రము లేకుండ వారు తమ్మును కనుగొనరు." గృహము దేవుని వాక్యంచే పాలింపబడకుంటే ఏమి జరుగుతుంది? గృహాన్ని William Cowper అనే కవి "పతనంలో సజీవంగా నిలిచిన పరదైసు యొక్క ఒకే ఆనందం" అని పిలిచాడు. విషాదకరంగా, కొన్ని గృహాలు పరలోకపు ముందు రుచిగా ఉండడానికి బదులు నరకం వెలుపల కావలిగా ఉన్నాయి:

గృహంలోని బాంధవ్యాలు ఉండవలసిన తీరులో ఉండాలంటే, అవి క్రైస్తవ బాంధవ్యాలైయుండాలి అని చెప్పుకున్నాం. అనేక కుటుంబాల్లో ప్రతి వ్యక్తి క్రైస్తవుడు క్రైస్తవురాలు కానందున, మూడు ముక్కల్లో హెచ్చరికనిస్తాను: (1) ఒక కుటుంబంలో నీవే క్రైస్తవుడవై యితరులు క్రైస్తవులు కాకపోతే, క్రైస్తవునిగనే ప్రవర్తించు – యితరులు దేవుని పిల్లలైనందున కాదు (వారు ఎలాగో కారనుకో), కాని నీవు దేవుని బిడ్డవు గనుక. (2) నీవు క్రైస్తవుడవు కానట్టయితే, క్రైస్తవుడవవ్వడానికి మరొక రోజు కూడ వేచియుండకు. (3) నీవు వివాహం చేసికొనకపోతే, క్రైస్తవ వ్యక్తిని వివాహమాడ ప్రయత్నించు.

## బాధ్యత (5:22-24; 6:1-4)

క్రైస్తవ గృహంలోని ప్రతి వ్యక్తికి దేవుడనుగ్రహించిన కొన్ని బాధ్యతలున్నట్టు మన మూల వాక్యము అవుట్‌లైన్ చేస్తుంది. తరువాత పాఠాలలో ఈ బాధ్యతలలో కొన్నింటిని గురించి మరికొంత మాట్లాడుకుందాం; అయితే ప్రస్తుతానికి, క్లుప్త సంగ్రహాన్ని యిస్తాను. క్రిందనున్న చిన్న పటంలో పైనున్న "C" క్రీస్తుకును, "H" భర్తకును "W" భార్యకును "C" పిల్లలకును నిలుస్తుంది.




క్రీస్తు సంఘమునకు శిరస్సని, సంఘము ఆయనకు లోబడియుండాలని ఎఫెసీయులకు 5:23, 24 తేటపర్చుతుంది. "పరలోకమందును, భూమిమీదను సర్వాధికారము" ఆయనకు అనుగ్రహింపబడింది (మత్తయి 28:18). గృహములో, భర్త, భార్య, పిల్లలు ఆయనకు లోబడియుండాలి.

దానిలాగే స్పష్టంగా, భర్త భార్యకు శిరస్సైయున్నట్టు చెప్పబడింది: "క్రీస్తు

సంఘమునకు శిరస్సైయున్నలాగున పురుషుడు భార్యకు శిరస్సైయున్నాడు క్రీస్తే శరీరమునకు రక్షకుడైయున్నాడు. సంఘము క్రీస్తునకు లోబడినట్టుగా భార్యలు కూడా ప్రతి విషయములోను తమ పురుషులకు లోబడవలెను" (5:23, 24). పటంలో భార్య క్రీస్తువారికిని, తన సొంత భర్తకును లోబడియున్నట్టు చిత్రింపబడింది.

గృహంలోని పిల్లలు వారి తలిదండ్రులకు లోబడాలని కూడ ఈ లేఖన భాగం ప్రకటిస్తుంది: "పిల్లలారా, ప్రభువునందు మీ తలిదండ్రులకు విధేయులైయుండుడి; ఇది ధర్మమే" (6:1). ఈ విధంగా, పటంలో, వారు క్రీస్తుకును, తమ తండ్రికిని, తమ తల్లికిని విధేయులైయుండాలి.

గృహం దేవుడు కోరినట్టు ఉండాలంటే, కుటుంబంలోని ప్రతి సభ్యుడు సభ్యురాలు దేవుడు తనకు నియమించిన బాధ్యతలను అంగీకరించాలి. గృహాన్ని గూర్చిన ఒక తమాషాయైన ఉక్తి ప్రాముఖ్యమైన సత్యాన్ని వ్యక్తపరచుతుంది:

> కీడు వృద్ధిపొందిన పరితాపకరమైన కుటుంబాలు సూచిస్తాయి
> కోడిపుంజు నిశ్శబ్దంగా ఉందో లేక కోడిపెట్టే కూస్తుందో;
> ఆ రెండింటిలో ఏది ఎక్కువ ప్రకృతి విరుద్ధంగా జీవిస్తుందో,
> విధేయులైన భర్తలో లేక చెలామణి చేసే భార్యలో.

ఈ వచనాన్ని నేటి దినాల దృష్టిలో చూచినట్టయితే, పిల్లలు నడిపించే కుటుంబాలు బహు అసహజమైనట్టు మనం చేర్చవచ్చు.

కుటుంబ యజమానికి కీలకమైన పదం "బాధ్యత." శిరస్సైయుండడం భాగ్యం కాదు, అది బాధ్యత. అటు శరీర సంబంధమైన, యిటు ఆత్మ సంబంధమైన విషయాలలో యింటిని నడిపించే మనిషి మీద గొప్ప బాధ్యత ఉంటుంది (6:4 చూడు).

మన మూల వాక్యమందు చెప్పబడిన బాధ్యతలు హెచ్చు స్థితిని, తక్కువ స్థితిని సూచించవు.[2] తక్కువ స్థితిలో ఉన్న స్త్రీలను బైబిలు ఎన్నడూ చిత్రించదు. సామెతలు 31లోని "గుణవతియైన స్త్రీని" చూడు. ఆమె నిజంగా అర్హురాలైన స్త్రీ! సగటు వ్యాపారపు యజమానికి ఆమె నిర్వహణ, పరిశ్రమ, నైపుణ్యం, మానవ సంబంధాలను గూర్చి పంచుకోగలదు!

దేవుడు అనుగ్రహించిన బాధ్యతలను కుటుంబ సభ్యులందరు అంగీకరించినప్పుడు, కుటుంబం అద్భుతంగా నడుస్తుంది. ఇంటిలోని సమస్యలన్నింటిని యిది ఆటోమేటిక్‌గా పరిష్కరించదు. కాని ఆ గమ్యం సాధించడానికి యిది బహుగా సహాయపడుతుంది.

తప్పకుండా ప్రశ్నలు లేస్తాయి: "ఇంటిలో కొందరు దేవుడనుగ్రహించు బాధ్యతలను నిర్వహించుతూ కొందరు నిర్వహించకపోతే ఏమౌతుంది?"; "ఆమె లేక అతడు తన బాధ్యత నిర్వహించనప్పుడు నేను నా పాత్రను ఎలా నెరవేర్చగలను?" ఆ ప్రశ్నలకు పౌలు జవాబిచ్చాడు. 5:22లో నొక్కి చెప్పిన ఉద్దేశాన్ని గమనించు: "స్త్రీలారా, ప్రభువునకువలె మీ సొంత పురుషులకు లోబడియుండుడి." 6:1లో, తలిదండ్రుల పట్ల పిల్లల యొక్క బాంధవ్యంలో కూడ ఆలాగే నొక్కి చెప్పబడడం కన్పిస్తుంది: "పిల్లలారా, ప్రభువునందు మీ తలిదండ్రులకు విధేయులైయుండుడి; ఇది ధర్మమే." కొలొస్సయులకు

3:23లో దీనికి సంబంధించిన లేఖన భాగము ఈ ఆలోచనను విస్తరింపజేస్తుంది: "... మీరేమి చేసినను అది మనుష్యుల నిమిత్తము కాక ప్రభువు నిమిత్తమని మనస్ఫూర్తిగా చేయుడి" (KJV).

సంఘము పట్ల క్రీస్తు ప్రేమను గూర్చి మాట్లాడుటవలన కుటుంబము యొక్క రమ్యమైన ఉదాహరణను పౌలు యిచ్చాడు, సంఘం చేయవలసిందంతా అదేనా? కాదు. "సంఘము ఎల్లప్పుడును నాకు లోబడియుండనందున – వాస్తవానికి, అది నాకు అపనమ్మకంగా ఉంటున్నందున – నేను ఏ మాత్రమును ప్రేమతో కూడిన నడిపింపు నివ్వను" అని క్రీస్తు అంటారా? "నేను సంఘాన్ని ప్రేమించను దాన్ని జీవించడానికి నేను చేయవలసినదంతా చేయనని" ఆయన అంటారా? లేదు.

నీ యింటనున్నవారందరు తమ బాధ్యతను అంగీకరించకపోయినట్టయితే, అది నిజంగా ఎలా ఉండాలో అలా నీ కుటుంబం ఉండదు. ఆలాటి పరిస్థితి అయినా కాకపోయినా, దేవుడు ఎలా ఉండవలెనని నిన్ను కోరాడో నీవు అలా ఉండాలని తీర్మానించుకోవాలి.

## ప్రేమ (5:25, 28, 29, 33)

25వ వచనాన్ని, దాని వెంట వచనాలను అభినందించడానికిగాను, పౌలు దినాల్లోని లోకాన్ని గూర్చి కొంత మనం గ్రహించవలసియుంటుంది. యూదుల ప్రపంచంలో, భార్యలు, వివాహాలు, కుటుంబాలు (గృహాలు) సిద్ధాంత రీత్యా ఎక్కువ గౌరవ స్థాయిలో ఉండేవి గాని ఆచరణలో అది వాస్తవం కాదు. యూదుడు తన ఉదయ కాలపు ప్రార్థన చేసినప్పుడు, తాను "అన్యజనుడుగాను, బానిసగాను, లేక స్త్రీగాను" ఉండనందుకు అతడు దేవుని స్తుతిస్తాడు.[3] విడనాడడం యూదుల మధ్య తేలిక; బహు అల్పమైన కారణాలకు భార్యలు విడనాడబడుతూ ఉంటారు.

గ్రీసుదేశస్థుల స్థితి యింకా దారుణంగా ఉండేది. వేశ్యావృత్తి గ్రీకు జీవిత విధానంలో పూర్తిగా భాగమైయుంది. Demosthenes యిలా రాశాడు, "ఉల్లాసం కొరకు మాకు వేశ్యలుంటారు; అనుదినం కలిసి జీవించడానికి ఉంపుడుకత్తెలుంటారు (ఉప పత్నులు); చట్ట బద్ధమైన పిల్లలను కలిగియుండడం కొరకు భార్యలుంటారు, మా యింటి వ్యవహారాలన్నిటికి నమ్మకమైన గృహనిర్వాహకుడుంటాడు."[4]

రోము యొక్క ప్రపంచం దీనికంటె బహు దైన్యంగా ఉంటుంది. పౌలు దినాలకు, రోమా కుటుంబ జీవితం అంతా చితికిపోయినట్టుంది. ఒక స్త్రీ అయిదు సంవత్సరాలలో ఎనిమిదిమంది పెనిమిట్లను కలిగియుండిన సంగతిని ఒక రోమా రచయిత చెప్పాడు. ఒక స్త్రీ తన ఇరవై మూడవ భర్తను పెండ్లి చేసికొన్నట్టును – ఆమె అతనికి ఇరవై ఒకటవ భార్యయైయున్నట్టును ఆరంభ క్రైస్తవ చరిత్రకారుడు తెలిపాడు.

ఆ రోజుల్లో స్త్రీలకు, పిల్లలకు ప్రాథమికంగా ఏ హక్కులుండేవి కావు. వారి జీవితాలకు సంబంధించిన తీర్మానాలు యింటి యజమానిచేతనే చేయబడేవి.

ఈ పూర్వ చరిత్రకు వ్యతిరేకంగా, పౌలు యిలా వ్రాశాడు, "పురుషులారా, మీరును

మీ భార్యలను ప్రేమించుడి. క్రీస్తుకూడ సంఘమును ప్రేమించి, ... దాని కొరకు తన్ను తాను అప్పగించుకొనెను" (25 వ.). ఈ సమాచారానికి ఆశ్చర్యపోయిన భర్త, "భర్తకు కూడ భార్యపట్ల కొన్ని బాధ్యతలున్నాయంటావా?" అని పౌలు దినాల్లో అడుగుతాడని నేను ఊహించగలను. "అవును" "అందులో మొదటిది భార్యను ప్రేమించడం" అని పౌలు అంటాడు. ఈ సత్యాన్ని మనం నిర్లక్ష్యం చేయకూడదని అపొస్తలుడు కోరతాడు. గనుక అతడు ఈ విషయాన్ని మూల వాక్యంలో ముమ్మారు అంటాడు:

> పురుషులారా, మీరును మీ భార్యలను ప్రేమించుడి. క్రీస్తు కూడ సంఘమును ప్రేమించి ... దానికొరకు తన్నుతాను అప్పగించుకొనెను" (25 వ.).

> *అటువలెనే పురుషులు కూడ తన సొంత శరీరములవలె తమ భార్యలను ప్రేమింప బద్ధులైయున్నారు* (28ఎ వ.).

> మెట్టుకు మీలో ప్రతి పురుషుడును తననువలె *తన భార్యను ప్రేమింపవలెను* (33ఎ వ.).

భర్త తన భార్యను ఎలా ప్రేమించాలి? "క్రీస్తు సంఘమును ప్రేమించినట్లుగా." క్రీస్తు సంఘంకొరకు ఎలాటి ప్రేమను కలిగియున్నారు? హీనపరచే, పగ తీర్చుకొనెడి, స్వార్థపరమైన "ప్రేమయా?" తాను "యజమానియని" రుజువు చేసికొనడానికి రూల్సు పెట్టి వాటియందు ఆనందించే "ప్రేమయా?" లేదు! ఆయన ప్రేమ స్వార్థ రహితమైన ప్రేమ; ఆ మహా గొప్ప ప్రేమను బట్టి, సంఘముకొరకు "తన్నుతాను అప్పగించుకొన్నారు."

"అటువలెనే పురుషులు కూడ తమ సొంత శరీరములనువలె తమ భార్యలను ప్రేమింప బద్ధులైయున్నారు. తన భార్యను ప్రేమించువాడు తన్ను ప్రేమించుకొనుచున్నాడు. తన శరీరమును ద్వేషించినవాడెవడును లేడు గాని ప్రతివాడును దానిని పోషించి సంరక్షించుకొనును ... ఆలాగే క్రీస్తుకూడ సంఘమును పోషించి సంరక్షించుచున్నాడు" అని 28, 29 వచనాలు కలుపుతున్నాయి. వాస్తవంగా, క్రీస్తు సంఘమును తన సొంత శరీరం కంటె *అధికంగా* ప్రేమించారు – ఎలాగంటే సంఘాన్ని కొనడానికి గాను ఆయన తన శరీరాన్ని సిలువపై అర్పించారు.

మనం చదువుతున్న ఈ వచనాల మీద Chrysostom అనే ఆరంభ రచయిత ఈ క్రింది కామెంట్ చేశాడు:

> నీవు విధేయత యొక్క కొల పరిమాణాన్ని చూచావా? ఇక్కడ కూడ ప్రేమ యొక్క కొల పరిమాణమే. సంఘము క్రీస్తుకు లోబడినట్టుగా నీ భార్య నీకు లోబడాలను కొంటున్నావా? క్రీస్తు సంఘాన్ని లక్ష్యపెట్టినంతగా నీవును చేయి. నీ ప్రాణాన్ని ఆమెకొరకు యివ్వవలసిన అవసరం వచ్చిందనుకో, లేదా వెయ్యి ముక్కలుగా తుంచబడవలసి వచ్చిందనుకో, లేదా నీవు సహించవలసి వచ్చినా, నిరాకరించకు ... తన మహా చింతవలన సంఘాన్ని ఆయన తన పాదముల యొద్దకు తెచ్చుకున్నాడు, (అంతేగాని) బెదిరింపువలనో, భయంవలనో ఆలాటి మరి దేనివలనో కాదు. ఆలాగుననే నీవును నీ భార్య పట్ల మసలుకో.[5]

ఆ విధంగా ప్రేమించే భర్తలకు లోబడడంలో కొద్దిమంది భార్యలకు యిబ్బందిగా ఉండవచ్చు.

ఈ విధమైన ప్రేమయే కుటుంబంలోని సమస్త బాంధవ్యాలను సూచించేదై ఉండాలనుకో: భార్యలు తమ భర్తలను ప్రేమించాలి; తలిదండ్రులు తమ పిల్లలను ప్రేమించాలి; పిల్లలు తమ తలిదండ్రులను ప్రేమించాలి. యౌవన స్త్రీలు తమ భర్తలకు లోబడియుండి "తమ భర్తలను శిశువులను ప్రేమించువారై … యుండాలని" నేర్పించబడ వలసియున్నట్టు పౌలు తీతుకు తెలిపాడు (తీతు 2:4). ప్రేమ గృహం యొక్క గుండె కాయయై ఉంది.

## పరిశుద్ధత (5:25-27)

ఆత్మ సంబంధమైన తన భార్య పట్ల తాను కనుపరచిన ప్రేమతో క్రీస్తువారు సాధించ ప్రయత్నించిన ఒక గమ్యాన్ని 25నుండి 27 వచనాలు మనకు తెలుపుతున్నాయి:

> … అటువలె క్రీస్తుకూడ సంఘమును ప్రేమించి, అది కళంకమైనను ముడుత యైనను అట్టిది మరి ఏదైనను లేక, పరిశుద్ధమైనది గాను, నిర్దోషమైనది గాను మహిమగల సంఘముగాను ఆయన తనయెదుట దానిని నిలువబెట్టుకొనవలెనని, వాక్యముతో ఉదకస్నానముచేత దానిని పవిత్రపరచి, పరిశుద్ధపరచుటకై దానికొరకు తన్ను తాను అప్పగించుకొనెను.

"కళంకమైనను ముడుతయైనను అట్టిది మరి ఏదైనను లేక" అనే మాటలను ఆలోచించు. యేసు తానే సంఘము పట్ల పరిశుద్ధుడు, పవిత్రుడు, నమ్మకమైనవాడు. పవిత్రమైన, పరిశుద్ధమైన, తనకు నమ్మకమైన పెండ్లి కుమార్తెను ఆయన కోరుతున్నాడు.

"నమ్మకద్రోహము నిజంగా వివాహానికి హాని చేయదు; వాస్తవంగా కొన్ని సందర్భాల్లో, అది యింకా మేలైనదిగా చేయవచ్చు" అనే సందేశంతో మనం ఉక్కిరిబిక్కిరి అవుతున్నాం. అది అపవాది యొక్క అబద్ధం. ఎక్కడైతే ఇద్దరు ఒకరికొకరు అర్పించుకుని జీవితాంతం విధేయులుగా ఉంటారో ఆ వివాహం మంచిగా కొనసాగి పరిపూర్ణతను సాధిస్తుంది – వివాహపు జంటలోని యిరువురు ఒకరికొకరు తమ్మును తాము అప్పగించుకొని, విశ్వాసంతో అది ఆలాగేనని యిద్దరు ఎరిగినవారైయుండాలి.

"వివాహము అన్ని విషయములలో ఘనమైనదిగాను, పానుపు నిష్కల్మషమైనది గాను ఉండవలెను; వేశ్యాసంగులకును వ్యభిచారులకును దేవుడు తీర్పు తీర్చును" అని హెబ్రీ పత్రిక యొక్క రచయిత ఈ విషయాన్ని తేటగా పలికాడు (హెబ్రీయులకు 13:4).

## అభివృద్ధి (5:26, 27)

26, 27 వచనాలలో గుప్తమైయున్న సంగతులను యింకా కొంచెం ముందుకు తీసికొనిపోదాం: పవిత్రులనుగాను, పరిశుద్ధులనుగాను చేయడానికి క్రీస్తు మనలను ప్రేమిస్తున్నారు, కాని మనకు యింకను ఆ యోగ్యతలు లేవు. మనం ఏమైయుండాలో

అలా అయ్యుండడానికి క్రీస్తు మనలను ప్రోత్సహిస్తున్నారని మనం చెప్పవచ్చు. మనం ఏమైయుండాలో అలా కావడానికి సమయం పడుతుంది; అది ఎదుగుదలను కోరుతుంది.

ఈ సూత్రంతో వివాహానికిని, గృహానికిని ఏమి సంబంధం ఉంది? మనలో ఎక్కువ మంది ముందు వివాహం చేసికొని తరువాత ఏమి చేయాలి అని విచారణ చేస్తుంటారు. పెండ్లి చూపులు, ప్రధానాలు, వివాహం వగైరాలు జరిగిపోతాయి. ఆ తరువాత వివాహం జరిగిపోయిన సంగతిని ప్రక్కనుంచి జీవితంలో విజయవంతంగా సాగాలని ఆరాట పడతాం. ఒకరు, యిద్దరు, ముగ్గురు పిల్లలను కంటాం, బైబిలు స్కూలుకు, ఆరాధనకు వారిని తీసికొనిపోతాం, దానితో వారి పట్ల మన బాధ్యత తీరిపోయిందనుకుంటాం.

బాంధవ్యాలు ఎదగాలి అభివృద్ధి చెందాలని మనం గ్రహించాలి. బాంధవ్యాలు పెదగడానికి సమయం కావాలి. కుటుంబం ఏమైయుండాలో అది కావడానికి ప్రయాస అవసరమైయుంటుంది. ఏ సమస్యయైనా ఎదురైనప్పుడు, కుటుంబంలోని ప్రతి సభ్యుడు, సభ్యురాలు దేవుని సహాయంతో ఆ సమస్యను ఎదుర్కోవాలి.

## స్థిరత్వం (5:31; 6:3)

31వ వచనం ఎరుకైన వచనమే. అసలు అది ఆదికాండం 2:24లో కన్పిస్తుంది. మత్తయి 19:5లో అది ప్రభువైన యేసుచే కోట్ చేయబడింది. "–ఇందు నిమిత్తము పురుషుడు తన తలిదండ్రులను విడిచిపెట్టి తన భార్యను హత్తుకొనును; వారిద్దరును ఏకశరీరమగుదురు." (మార్కు 10:7, 8ని కూడ చూడు.) ఈ కొటేషన్‌లో అనేక గొప్ప సత్యాలు వ్యక్తపరచబడ్డాయి, కాని ఒకే విషయాన్ని మనం నొక్కి చెప్పుతాం: ఏమంటే వివాహము స్థిరమైనది.

ఏ బాంధవ్యంలోనైనా సమస్యలు అనివార్యం. అయితే, "యౌవనకాలమందు పెండ్లి చేసికొని" అన్యాయంగా ఆమెను "విసర్జించి" ద్రోహంగా ఆమె యెడల మసలుకోవాలని దాని అర్థం కాదు (మలాకీ 2:14). లేదా భార్యలు తమ భర్తల యెడల అలా జరిగించాలని కూడ దాని భావం కాదు. విడాకులను లేక విడిపోవడాన్ని దేవుడు ద్వేషిస్తాడు (మలాకీ 2:16). "గనుక దేవుడు జతపరచినవారిని మనుష్యుడు వేరుపరచకూడదు" అని ప్రభువు ప్రకటించారు (మత్తయి 19:6బి).

అనేకమంది పిల్లలు కడకు యింటిని విడిచిపెడతారు (మత్తయి 19:5), కాని వారి తలిదండ్రుల వివాహము దృఢమైనప్పుడు, వేళ్లు పదిలంగా ఉంటాయి; వారు ఎల్లప్పుడు "యింటికి తిరిగి వచ్చే" అవకాశముంటుంది. ఆ విధంగా, ఎఫెసీయులకు 6:3లోని సందేశం వారికి అర్థ సహితంగా ఉంటుంది. ప్రేమగల యింటికి తిరిగి వచ్చినప్పుడు, వారికి అంతా "క్షేమమే" కలుగుతుందని వారు ఎరుగుతారు.

## మర్యాద (5:21, 28, 33; 6:2, 4)

మనం చదువుతున్న లేఖన భాగం గౌరవమనే భావనతో ఆరంభమౌతుంది. ("క్రీస్తునందలి భయముతో") మరియు అది అర్హమైన మర్యాదతోనే ముగింపబడుతుంది.

("భార్య తాను భర్తపట్ల గౌరవంతో మెలిగేటట్లు చూచుకోవాలి"). 5:21లోని "భయము" అనేది నామవాచకం, 5:33లోని "మర్యాద" అనేది క్రియావాచకం; గ్రీకులో యివి రెండును ఒకే పద మూలంనుండి వచ్చాయి. "లోతైన హృదయపూర్వకమైన గౌరవం" అని ఆ పదానికి అర్థం.[6]

ఎఫెసీయులకు 5:21–6:4లో, మూడు బాంధవ్యాలలోను గౌరవము అనేది ప్రత్యేకంగా ప్రస్తావించబడింది: అందరు ప్రభువును గౌరవించాలని (5:21), భార్యలు తన భర్తలను గౌరవించాలని (5:33), పిల్లలు తన తలిదండ్రులను సన్మానించాలని (6:2) చెప్పబడింది. కుటుంబంలోని ప్రతి బాంధవ్యంలోను గౌరవం అవసరమైయుంది: "తన సొంత శరీరమునువలె భర్త తన భార్యను ప్రేమించాలి" (5:33), భార్యను గౌరవించడం అందులో గుప్తమైయుంది. "తండ్రులు తమ పిల్లలకు కోపము రేపక" అనేదానిలో (6:4ఎ) పిల్లలపట్ల మర్యాద గుప్తం చేయబడింది.

పిల్లలుగా, మన యింటిలో ఉన్నవారందరిని మర్యాదగా మనం చూడవలసిన అవసరముంది: సాటి మానవులంగా మనం ఒకరినొకరం గౌరవించుకోవలసియుంది. క్రీస్తునందు సోదరీ సోదరులుగా మనం ఒకరినొకరం గౌరవించుకోవాలి. అంగి అనే నా కనిష్ట పుత్రిక 9 సంవత్సరాల ప్రాయంలో క్రైస్తవరాలైయ్యింది. బాప్తిస్మపు నీటిలోనుండి ఆమె బయటికి వచ్చినప్పుడు, వణకుతున్న ఆమె దేహంచుట్టు నా కరములుంచాను. ఆమెకు నాకు నూతన బాంధవ్యం ఏర్పడింది. మా కుటుంబంలో మాకు తండ్రి బిడ్డల బాంధవ్యం మాత్రమే గాక, దేవుని కుటుంబంలో మాకు సహోదరుడు/సహోదరి అనే బాంధవ్యం ఏర్పడింది.

కుటుంబంలోని భాగంగా అన్యోన్య మర్యాద కలిగియుండడం అద్భుతం: భర్తలు తమ భార్యలను గురించి హీనంగా మాట్లాడరు; తమ భర్తల అసమర్థత విషయంలో భార్యలు నవ్వరు; తమ పిల్లలు బుద్ధిహీనులని తలిదండ్రులు తలచరు, ప్రేమించే తలిదండ్రుల పట్ల పిల్లలు మర్యాదగా, గౌరవంగా ఉంటారు.

## ముగింపు

దేవుడు కోరిన గృహం ఎలాటిదైయుంటుంది? అది స్వార్థరహితమైన, గౌరవపదమైన, బాధ్యతతో కూడిన, ప్రేమగలిగిన, పరిశుద్ధతగల, స్థిరమైన, మర్యాదగల చోటైయుంటుంది. మనకు ఆలాటి కుటుంబాలు కావాలంటే, మనలో ప్రతి ఒక్కరు అతడు/ఆమె ఏమి చేయగలరో అది చేయాలి; మనలో ప్రతి ఒక్కరు ఏమైయుండాలో అతడు/ఆమె ఆలాగై ఉండాలి.

ఒకప్పుడు నేను ఈలాటి అంశం మీద మాట్లాడినప్పుడు, ఒక స్త్రీ నా యొద్దకు వచ్చి, "ఈ రోజు ప్రసంగం ఎవరైనా టేపు చేశారా? నా భర్తకు యివ్వడానికి నేనొక కాపీ తీసికొంటాను! నేను అతనికి దీన్ని వినిపిస్తాను" అని అన్నది. ఈ ప్రసంగం నీ జంటకు గాని, నీ పిల్లలకు గాని మంచిది కాకపోవచ్చు, కాని యిది నీకు సహాయం చేయగలదు. "నా గృహాన్ని శ్రేష్ఠమైనదిగా చేసికొనడానికి నేనేమి చేయగలను? నీ కుటుంబంలో బాంధవ్యాలను పెంచుకొనేది ఎలా?" అని నిన్ను నీవు అడుగుకో.

నీవు క్రైస్తవుడవు/క్రైస్తవురాలవు కాకుంటే, నీవు తీసికొనవలసిన మొదటి మెట్టు దేవుని బిడ్డగా మారడానికి చూడు (మార్కు 16:16; అపొస్తలుల కార్యములు 2:38). నీవు అపనమ్మకమైన క్రైస్తవ జీవితంలో ఉంటే, ప్రభువు నొద్దకును ఆయన సంఘము నొద్దకును తిరిగిరా (అపొస్తలుల కార్యములు 8:22; యాకోబు 5:16) నీవు ఆయనకు లోబడవలసియుంటే, యిప్పుడే అనుకూల సమయం![7]

సూచనలు

[1]David Lipscomb, "Ephesians, Philippians, and Colossians" in *A Commentary on the New Testament Epistles,* ed. J. W. Shephred (Nashville: Gospel Advocate Co., 1960), 4:117. [2]నేను వేగంగా వెళ్లినందుకు పోలీసు నన్ను ఆపితే, అతడు అధికుడు కాడు నేను అధముడను కాను. అతనికి నామీద అధికారముంటుంది (రోమా 13:1). బైబిలు అధికారంలో, అధికుడు అధములు ఉండరు, దేవుని ఏర్పాటులో సమస్తం జరిగించాలి. [3]Quoted in William Barclay, *The Letters to the Galatians and Ephesians,* rev. ed., The Daily Study Bible Series (Philadelphia: Westminster Press, 1976), 168-71. [4]Ibid. [5]Ibid., 173. [6]The KJV has "reverence" in 5:33. [7]వివాహము, గృహము అనే అంశాల మీద నేను మాట్లాడినప్పుడు నేను ఈ ప్రాథమిక ఆహ్వానాన్ని యిస్తాను. గృహం మీద నేను ఎప్పుడు మాట్లాడినా, అది క్రైస్తవ గృహమై ఉండాలని, అంటే గృహంలోని ప్రతి వ్యక్తియు నమ్మకమైన క్రైస్తవుడు/క్రైస్తవురాలై యుండాలని నేను నొక్కి చెప్పుతాను. తరువాత ఒక వ్యక్తి ఎలా క్రైస్తవుడు/క్రైస్తవురాలు కావాలో, లేక ఎలా పునరుద్ధరింపబడాలో చెప్పి – స్పందించాలని నేను కోరతాను.